కొడంగల్‌కు విద్యాసంస్థల మంజూరు

కొడంగల్, సెప్టెంబరు 15: విద్యాహబ్‌గా మారనున్న కొడంగల్‌కు మరికొన్ని విద్యాసంస్థలు మంజూరైనట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజాగా నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం హకీంపేట్‌ప్రాంతంలో ఐటీఐ, జూనియర్ కళాశాల, పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు తెలిపారు. నిధుల మంజూరు కాగానే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సరదా.. సరదాగా..



వీకెండ్‌తో పాటు వరుస సెలవులు రావడంతో పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో పోటెత్తాయి. ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు రద్దీ పెరిగింది. ఆదివారం సందర్శకులు పారుతున్న అలుగులో జలకాలాడారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబసభ్యులతో, స్నేహితులతో ప్రాజెక్టు వద్దకు వచ్చిన వారు అలుగు నీటిలో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. కొంతమంది ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు.

- ధారూరు, సెప్టెంబరు 15



తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని

ఘనంగా నిర్వహించాలి



» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబరు 15 : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించేందుకు ఆయాశాఖల వారీగా ఆదేశాలు జారీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్ల మాదిరిగానే ప్రజాపాలన దినోత్సవ వేడుకలు కూడా జరగాలన్నారు. ఇందుకుగాను వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని, ముఖ్యఅతిథులు పాల్గొంటారని, పోలీసు గౌరవ వందనం స్వీకరణ, తెలంగాణ రాష్ట్ర గీతం, జిల్లా అభివృద్ధిపై ప్రసంగం, తాగునీటి ఏర్పాట్లు వంటి వాటిని ముందే సిద్ధం చేసుకోవాలన్నారు. మండల, పంచాయతీల పరిధిలో ఉండే అధికారులు ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రోటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపించాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వేడుకలు విజయవంతం చేయాలని తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, మండలప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.



ఘనంగా సిలువ విజయ మహోత్సవం

సిలువ విజయ మహోత్సవాన్ని పరిగి నియోజకవర్గం గట్టుపల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చర్చిలో ఫాస్టర్ అంథోని ప్రార్థనలు చేసి ప్రసంగించారు. అనంతరం గ్రామ శివారులోని ఏసు సిలువ వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున క్రిస్టియన్లు పాల్గొన్నారు.

- పూడూరు, సెప్టెంబరు 15


పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చేపడుతున్న బీదర్-మహేశ్వరం 765కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు భూమి కోల్పోతున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. ఒక్కో టవర్‌కు 970 నుంచి 1,210 గజాల స్థలాన్ని సేకరిస్తున్నారు. భూమికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలని రైతులు కోరుతుంటే.. ప్రభుత్వం మాత్రం పదేళ్ల కింద 400కేవీ విద్యుత్ లైన్‌కు ఇచ్చిన పరిహారాన్నే ఖరారు చేసింది. భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో నామమాత్ర పరిహారంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. తమకు న్యాయమైన పరిహారం ఇచ్చి పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులు, సంఘాలు సంఘటితమై ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

- » కొనసాగుతున్న బీదర్-మహేశ్వరం 765కేవీ లైన్ పనులు
- » 400కేవీ లైన్‌కు నిర్ధారించిన పరిహారంతో సరి!
- » నామమాత్ర కంపెన్సేషన్‌తో రైతుల ఆగ్రహం
- » ప్రస్తుత మార్కెట్ ధర ఇవ్వాలని డిమాండ్
- » పలు చోట్ల పనుల అడ్డగింత
- » నిరసనలకు సిద్ధమవుతున్న భూ నిర్వాసితులు

రైతుల ఆమోదం లేకుండానే భూసేకరణ

హైటెన్షన్!

ట్రాన్స్‌మిషన్ లైన్‌తో ఆందోళన



వికారాబాద్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15): పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌అండ్‌టీ సంస్థ బీదర్ నుంచి మహేశ్వరం వరకు వేస్తున్న 765కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ పనులతో రైతుల్లో టెన్షన్ నెలకొంది. ఎకర, రెండెకరాలు సాగుచేసుకుంటున్న సన్న, చిన్నకారు రైతుల జీవితాల్లో విద్యుత్ టవర్లు చిచ్చు రేపుతున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే భూముల నుంచి హైటెన్షన్ టవర్లు, లైన్లు రైతుల అనుమతి లేకుండానే వేస్తుండడంతో ఆందోళన మొదలైంది. తమకు పరిహారం ఇవ్వకుండానే ఇష్టానుసారం పనులు చేస్తుండడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చేవెళ్ల మండలం రేగడి ఘనాపూర్, పలు చోట్ల 765కేవీ లైన్ పనులను రైతులు అడ్డుకున్నారు. తమకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాకే పనులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

2014లో తెలంగాణ ప్రభుత్వం శంకర్‌పల్లి మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు 400కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసింది. ఒక్కో టవర్‌కు 350 గజాల భూమి చొప్పున సేకరించింది. రోడ్డు ఫేసింగ్ భూమికి రూ.4.5 లక్షలు, కొంత లోపలికున్న భూమికి రూ.3.5లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. ప్రస్తుతం బీదర్ నుంచి మహేశ్వరం వరకు వేస్తున్న 765కేవీ సామర్థ్యం ఉన్న ఒక్కో టవర్‌కు 970 నుంచి 1,210గజాల స్థలం అవసరం. ఈ కారిడార్ నిర్మాణం కూడా 60 మీటర్ల వెడల్పుతో చేపట్టారు. పదేళ్ల క్రితం 400 కేవీ విద్యుత్ టవర్ కోసం సేకరించిన భూమికి నిర్ణయించిన నష్టపరిహారాన్నే ప్రస్తుత 765కేవీ టవర్ నిర్మాణాలకు చెల్లిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.

బీదర్-మహేశ్వరం 765కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ రైతులను నష్టాల్లోకి నెట్టేస్తుంది. పరిహార నిర్ధారణలో అధికారులు, నిర్మాణ సంస్థ కలిసి రైతులను నిండా ముంచుతున్నారు. టవర్లకు అవసరమైన అల్యూమినియం, స్టీల్, సిమెంట్, కూలీలను ప్రస్తుత ధరల మేరకు నిర్ణయించి, రైతుల భూమికి మాత్రం పదేళ్ల కిందటి ధరలనే నిర్ధారించడం అనుమానాలకు తావిస్తోంది. రైతుల సమ్మతి లేకుండా భూముల్లో టవర్లు నిర్మించడంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయమైన పరిహారం ఇవ్వకుంటే ట్రాన్స్‌మిషన్ లైన్ పనులను అడ్డుకుంటామని రైతులు, భూ నిర్వాసితులు హెచ్చరిస్తున్నారు. అలాగే కర్నూలు నుంచి వచ్చే లైన్‌కు జారీ చేసిన ఉత్తర్వులను బీదర్ లైన్‌కు చూపి ప్రైవేట్ భూముల్లో టవర్లు వేయడం సరి కాదంటున్నారు.



రేగడిఘనాపూర్‌లో టవర్ పనులను అడ్డుకుంటున్న రైతులు(ఫైల్)

190 కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్

కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో ఏర్పాటు చేసిన భారీ సోలార్ పవర్‌ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు బీదర్ నుంచి కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని 765కేవీ పవర్ గ్రిడ్ అనుసంధానానికి 190 కిలోమీటర్ల భారీ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు నిర్ణయిచింది. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని 20 మండలాలు, 315 గ్రామాల మీదుగా లైన్ వేయనున్నారు. ఇందుకు

మిగతా 5వ పేజీలో...

ట్రాన్స్‌మిషన్ లైన్ వెళ్లే మార్గాలివే..

కేశంపేట మండలంలోని పోమాల్‌పల్లె, పెద్ద గుట్ట, లేమామిడి, చిన్నకుంటపల్లె, వేముల్‌నర్వ, బోదనంపల్లె, కేశంపేట్, కొత్తపేట, అల్వాల్, పోచన్నపేట్, చిన్నకుంటపల్లి, ఇప్పలపల్లె, చౌలపల్లి, పడకల్, న్యామతాపూర్ సాకేత్ కోట్ల, రావిచెడు, చౌలపల్లి ఈస్ట్, సంతాపూర్. చేవెళ్ల మండలం హస్తేపూర్, అంతారం, నాన్‌చెరువు, ఖానాపూర్, రేగడి ఘనాపూర్, దేవరంపల్లి, బస్తేపూర్, చెనువెల్లి, ఇంద్రాడ్డినగర్, మీర్జాగూడ, వెంకన్నగూడ, కిష్టాపూర్, ఆలూరు, బస్తేపూర్, నౌలయపల్లి, కౌకుంట్ల. షాబాద్ మండలం బొబ్బిలిగామ, కొమరబండ, ఎర్రోనిగూడ, తిమ్మారెడ్డిగూడ, నాగరగూడ, పోలారం, ముద్దెంగూడ, సంకెపల్లిగూడ, గొల్లూరిగూడెం, బోన్‌గిరిపల్లె, షాబాద్, కుమ్మరిగూడ, మల్లారెడ్డిగూడ, కేశగూడెం, మరియాపూర్, టేకులపల్లి, చెర్యగూడెం, యల్గొండగూడ, కాస్తిపూర్, నారెడ్లగూడ, మీరాపూర్‌దర్గా, బోడంపహాడ్, మన్మర్రి, దోసాడ, బీరంపల్లె, ఉత్తరాస్‌పలల్లి, చుక్కమెట్, రేగడి చిలకమర్రి, ఓబగుంట, మక్తగూడ. కొందుర్గు మండలం రేగడి చిలకమ్మర్రి, చుక్కమ్మెట్, ఉత్తరాస్‌పల్లి, టేకులపల్లి, ముట్పూర్ బీరంపల్లి. ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ, యల్లపల్లి, మొగిలగిద్ద, మొల్లోని గడ్డతండా, రంగంపల్లి, రంగధాముల, రంగసముద్రం, చౌలపలెల్ల వెస్ట్, పీర్లగూడ, చౌలపల్లి, దేవునిపల్లి, కందివనం, సూవర్ణకటూర్, చించోడ్, అయ్యవారిపల్లి, కంసాన్‌పల్లె, రిగ్వేద ఇందీవరం, భీమారం, ఉరేంకితండా, మొల్లోనిగడ్డతండా, ఉదిత్యాల్, విట్యాల్ వీరన్నపాళ్య, సూరారం, బాలానగర్, యల్లంపల్లి, ఎల్కట్ట. కడ్తాల్ మండలం రావిచెడ్, న్యామతాపూర్, మక్తమాదారం, నాగిరెడ్డిగూడ, టక్రాజ్‌గూడ, కొండ్రిగానిబోడుతండా, సాలాపూర్, వంపుగూడ, చెల్లంపల్లె, మైసిగండి, దాసగిరిపల్లి తండా, పడకల్, ఎక్రాజిగూడ, అవురం విల్లా, కడ్తాల్, మహిసమ్మ, కనుగుబాయి తండా, గానుగుమర్ల తండా, హన్మాన్‌పల్లి, దాసర్లపలల్లి, తరంగ్ సిటీ, ఎక్రాజ్‌గూడ, అన్మాన్‌పల్లి. కందుకూరు మండలం సాయిరెడ్డిగూడ, ముచ్చెర్ల, ఉట్లపల్లి, సర్వరావులపల్లి, అన్మాన్‌పల్లి, మరియకుంట తండా, పోచమ్మరాలు తండా, సర్వరావులపల్లె, వాయిల్‌కుంటతండా, మహ్మద్‌పూర్, డెబ్బగూగ, దాసర్లపల్లి, లచ్చానాయక్ తండా గ్రామాలు ఉన్నాయి.

ఎర్రమట్టికి ఎసరు!

లారీ పార్కింగ్ స్థలంలో అక్రమంగా తవ్వకాలు



తవ్వకాల ప్రాంతంలో హిటాచీ, లారీ

- » రోడ్డు పనులకు తరలింపు
- » ప్రభుత్వ ఆదాయానికి గండి
- » మొరం తవ్వకాలతో భారీ గుంతలు
- » పట్టించుకోని అధికారులు



లారీ పార్కింగ్ స్థలంలో తవ్వకాలు

తాండూరు రూరల్, సెప్టెంబరు 15 : తాండూరు మండలం అంతారం గ్రామ శివారులోని లారీ పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో కొందరు అక్రమార్కులు అక్రమంగా ఎర్రమట్టి(మొరం) తరలిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భారీ హిటాచీలతో యథేచ్ఛగా టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని రోడ్డు పనులకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు. అంతారం గ్రామ శివారు సర్వేనెంబర్-58లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని లారీ పార్కింగ్ కోసం కేటాయించారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామి మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా రూ.12కోట్ల 26లక్షల నిధులు చేయించి, 6 అక్టోబర్ 2023లో శంకుస్థాపన చేశారు. అనంతరం జేసీబీతో లారీలను పార్కింగ్ చేసేందుకు చదును చేసి వదిలేశారు. అయితే అట్టి స్థలంలో లారీలు పార్కింగ్ చేయడం లేదు. ఇదే అదునుగా భావించిన రోడ్డు కాంట్రాక్టర్లు భారీ హిటాచీలను ఏర్పాటు చేసి వేలాది క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో లారీ పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో భారీ ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన అంతారం గ్రామస్తులు అక్కడికి వెళ్లి పరిశీలించగా, భారీ గుంతలను పరిశీలించి తవ్వకాలను అడ్డుకున్నారు. లారీ పార్కింగ్ స్థలం నుంచి రోడ్డు పనులకు మొరం తరలించేందుకు కాంట్రాక్టర్ వద్ద రెవెన్యూ, మైనింగ్, అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ప్రతిరోజు వందల టిప్పర్లతో ఎర్రమట్టిని రోడ్డు పనులకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. మైనింగ్ శాఖకు రాయల్టీ చెల్లించి మట్టి తవ్వకాలు చేపట్టాలి. కానీ ఇప్పటి వరకు రాయల్టీ కట్టకుండానే దర్జాగా ఎర్రమట్టిని తరలించారు.



ఎర్రమట్టి తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంత

అక్రమార్కులకు జరిమానా విధించాలి



అంతారం గ్రామశివారులో లారీ పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో వర్షానికి నీళ్లు నిండి ప్రమాదకరంగా మారాయి. కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎర్రమట్టి తరలిస్తున్న వారిపై భారీ ఎత్తున జరిమానా విధించాలి.

- వడ్డె కృష్ణ, ఎస్ఎంసీ మాజీ చైర్మన్

తవ్వకాలను అడ్డుకున్నాం



గుట్టుచప్పుడు కాకుండా ఎర్రమట్టి తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇంత పెద్దఎత్తున తవ్వకాలు జరిపినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్రమ తవ్వకాలను మేము అడ్డుకున్నాము. ఇంత జరుగుతున్నా కనీసం లారీ పార్కింగ్ ప్రతినిధులు సైతం ఇటువైపు రావడం లేదు. వారికి కూడా కాంట్రాక్టర్‌తో లోపాయికారి ఒప్పందాలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- నక్కల రాజు, అంతారం

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం



అంతారం శివారులోని సర్వేనెంబర్-58 లారీ పార్కింగ్‌లో మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. తవ్వకాల కోసం ఇప్పటి వరకు మా వద్ద ఎవరూ అనుమతులు తీసుకోలేదు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తాము. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే వాహనాలు సీజ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

గంగమ్మ ఒడికి గణనాథులు



ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో నిమజ్జనాలు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్‌రూరల్, సెప్టెంబరు 15: తొమ్మిదిరోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఘట్‌కేసర్ మున్సిపల్, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువుకట్టపై నిమజ్జనాలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. చెరువుకట్టపై రెండు భారీ క్రేన్లు ఏర్పాటు చేయగా, చిన్న వినాయకులను బతుకమ్మ ఘాట్ వద్ద, పెద్ద వినాయకులను వినాయక్ ఘాట్ వద్ద నిమజ్జనం చేశారు.సీఐ సైదులు ఆధ్వర్యంలో 113 మంది పోలీసు సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు ఘట్‌కేసర్ మున్సిపల్, ఎదులాబాద్ మెగా



గణపయ్య ఊరేగింపులో ఇంజనీరింగ్ విద్యార్థినులు

ఇంజనీరింగు కళాశాలలో వినాయక నిమజ్జనం కనుల పండువగా జరిగింది. కళాశాలలో ఉట్లు కొట్టె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక ఊరేగింపులో విద్యార్థుల నృత్యాలు అలరించారు. పలు వినాయక మండపాల వద్ద అన్నదానాలు చేశారు.



లక్ష్మీనారాయణ చెరువు కట్టపై భక్తుల రద్దీ

17 నుంచి స్వచ్ఛతా హీ సేవా

- పక్షం రోజుల పాటు కార్యక్రమాలు
- 'స్వచ్ఛ భారత్ దివస్'లో భాగంగా
- పట్టణాలు, పల్లెల్లో కార్యక్రమాల నిర్వహణ



తాండూరు, సెప్టెంబరు 15: స్వచ్ఛభారత్ దివస్‌లో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 15రోజుల పాటు పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాలను చేపట్టాలని అధికారులు ఆదేశించారు. తాండూరు డివిజన్ పరిధిలో తాండూరు, కొడంగల్ మున్సిపాలిటీలతో పాటు 260గ్రామ పంచాయతీలు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో తల్లి పేరున మొక్క (ఏక్‌పేడ్ మాకే నామ్)లు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చారు.

మూడు అంశాల ప్రాతిపదికన కార్యక్రమాలు

కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత పేరిట ప్రధానంగా మూడు అంశాల ప్రతిపాదికన స్వచ్ఛతాకి భాగీ దారి, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్రసురక్ష పేరిట ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. స్వచ్ఛతాకి భాగీ దారిలో భాగంగా ప్రజల భాగస్వామ్యం, అవగాహన కల్పించడం, సలహాలు స్వీకరిస్తారు. సంపూర్ణ స్వచ్ఛతలో భాగంగా శ్రమదానం, మెగా క్లీన్‌నెస్ డ్రైవ్, స్వచ్ఛంద సేవా, మరుగు కాల్వలను శుభ్రపర్చనున్నారు. సఫాయి మిత్ర సురక్షలో భాగంగా ఆరోగ్య పరీక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో కార్మికులకు వర్తించేలా అనుసంధానం చేయనున్నారు.

15రోజుల కార్యక్రమాలు ఇవే..

ఈనెల17వ తేదీన మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణసేవలు, 18న స్వచ్ఛత పరుగులు, సైక్లాథాన్‌లు, బ్లీచింగ్, దోమల నివారణకు మందులు పిచికారి, నీరు నిలిచిపోయే ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమచికిత్స, శిక్షణ, 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, డంప్‌లను గుర్తింపు, తొలగింపు, పారిశుధ్య కార్మికుల గుర్తింపు, మంజూరైన పథకాలతో అనుసంధానం చేస్తారు. 20వ తేదీన ప్లాంటేషన్ డ్రైవ్, 21న అవగాహన ప్రచార ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కుల శుభ్రపరచడం, పీపీఈ కిట్‌లు, సేఫ్టీ పరికరాలు పంపిణీ, 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాల్వలు, డ్రైన్లను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు వైద్య పరీక్షలు చేయనున్నారు. 23వ తేదీన వర్షపు నీరు నిల్వ, నిర్మాణాలపై అవగాహన రహదారుల శుభ్రత, 24న మంచి నీటి వనరుల శుభ్రత, నీటి నమూనాలను పరిరక్షించడం, వ్యక్తిగత రక్షణపై మున్సిపల్, పంచాయతీ కార్మికులకు అవగాహన కల్పించడం, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం, 26న అవాంచిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, పిల్లల సంరక్షణ, స్కాలర్‌షిప్‌లపై అవగాహన కల్పించడం, 27న వార్డు, గ్రామసభలు నిర్వహణ, ఖాళీ స్థలాల సుందరీకరణ, వీధుల క్లీనింగ్ నిర్వహించనున్నారు. అదేవిధంగా 28వ తేదీన సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్, ఆస్తుల సుందకీరణ, ఫుట్‌పాత్‌లు, ఇ-వ్యర్థాల సేకరణ, 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన, 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్‌పై పబ్లిక్ ప్రదర్శనలు, కమ్యూనిటీ బెస్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన, డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదు కార్యక్రమాలు చేపడుతారు. అక్టోబర్ 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ కథనాలపై నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, సన్మానాలు, అక్టోబర్ 2న గాంధీజయంతి సందర్భంగా ముగింపు కార్యక్రమాలు చేపడతారు. ప్రజాప్రతినిధులను, ప్రజలను, మహిళ సంఘాలను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం



మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కీసర రూరల్, సెప్టెంబరు 15: ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వార్డు కార్యాలయంలో ఆదివారం ఎంఎస్‌రెడ్డి లయన్స్ క్లబ్, ఆర్మీ డెంటల్ హాస్పిటల్, సరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు స్వామి, అంజయ్యగౌడ్, పెంటయ్యగౌడ్, అయా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో రైతుకు నష్టం



సీపీ 858 రకం విత్తన బ్యాగును చూయిస్తున్న రైతు నర్సింహులు

నవాబుపేట, సెప్టెంబరు 15: మండలంలోని చిట్టిగిద్ద గ్రామానికి చెందిన రైతు నర్సింహులు ప్రతీ సంవత్సరం పంట మార్పిడి చేస్తూ ఈసారి మొక్కజొన్న పంటను సాగుచేశాడు. సీపీ 858 రకం మొక్క జొన్న విత్తనాలు నాసిరకంగా ఉండటంతో తీవ్రంగా నష్టపోయాయనని నర్సింహులు ఆదివారం విలేకరుల ముందు వాపోయాడు. నాసిరకం విత్తనాలు కావడంతో మొక్కలు ఏపుగా పెరిగినా కంకులు రాకపోవడంతో నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. గతనెల 30వ తేదీన సీపీ 858 మొక్క జొన్న విత్తనాలను వికారాబాద్‌లో గుల్షన్ బ్రదర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో కొనుగోలు చేశానని తెలిపాడు. వ్యవసాయ అధికారులు స్పందించి నకిలీ విత్తనాలతో నష్టపోయిన తనకు న్యాయం చేయాలని కోరాడు.

విముక్తి కోసమే 'సాయుధ పోరాటం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య
- పులుసుమామిడిలో తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవ సభ


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధుల జంగయ్య

కొందుర్గు, సెప్టెంబరు 15: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసమే తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పులుసు మామిడిలో తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి కావాలని తెలంగాణ సాయుధ పోరాటాన్ని కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మొయినోద్దీన్‌ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించారని, ఈ పోరాటంలో వేలాది మంది చిన్న, సన్నకారు రైతులు పాల్గొని, ఎర్ర జెండాలు పాతి.. లక్షలాది ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని సాగు చేసినట్లు గుర్తుచేశారు. ఈక్రమంలో జాగీర్దార్లు, జమీందారులు కలిసి రైతులను అతి కిరాతకంగా చంపారని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగి వంటి వారు ప్రాణత్యాగం చేశారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే సెప్టెంబరు 17ను విలీన దినంగా ప్రకటిస్తామని చెప్పి మాట తప్పిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా విలీన దినంగా ప్రకటించి, అధికారికంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో బి.నర్సింహ, జి.వెంకటేష్, ఏఐటీయూసీ రెండు మండలాల కార్యదర్శులు బాల్‌రాజ్, సి.సురేష్, నాయకులు బాలకృష్ణయ్య, యామిని, ఎం.కృష్ణ, పెంటయ్య, వెంకటయ్య, రాంచంద్రయ్య, జంగయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చెట్ల నరికివేత


అంతారం దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నరికిన చెట్లను తరలిస్తున్న ట్రాక్టర్

తాండూరు రూరల్, సెప్టెంబర్ 15: ప్రభుత్వం ఓ వైపు మొక్కలు పెంచాలని, చెట్లు నరికేయరాదని ఆదేశాలు జారీచేస్తున్నా అవి అమలుకావడం లేదు. ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తున్నారు. అంతారం దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం పెద్దఎత్తున చెట్లను నరికేశారు. ఈ విషయమై ఎంఈవో వెంకటయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, చెట్లు నరికిన విషయంపై తనకు సమాచారం లేదని, క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ జరుపుతామని తెలిపారు.

విద్యార్థులు ఆసక్తి ఉన్న సబ్జెక్టులనే ఎంచుకోవాలి



మాట్లాడుతున్న శ్రీధరరావు సిధు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 15: విద్యార్థులు ఆసక్తి ఉన్న సబ్జెక్టులనే ఎంచుకొని అందులో రాణించేందుకు శ్రమించాలని ఎటీఅండ్‌టీ గ్లోబల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధరరావు సిధు అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనిధి యూనివర్సిటీ నూతన విద్యార్థుల ఓరియేంటేషన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇష్టమైన సబ్జెక్టులో పట్టుసాధిస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఇటీవల కాలంలో బ్యాకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఈకామర్స్, మార్కెటింగ్, గేమ్స్, సైబర్ సెక్యూరిటీ మిలటరీ, బాషాఅనువాదం, మిలటరీవిద్య, తయారీ రంగాల్లో కృత్రిమ మేధను విరివిగా వినియోగిస్తున్నారన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ కేటీ మహి మట్లాడుతూ శాస్త్ర సాకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని సిలబస్‌లో మార్పులు చేర్పులు చేస్తామన్నారు. ఉద్యోగమే లక్ష్యంగా కాకుండా మెరుగైన జీవితం కోసం విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రెసిడెంట్ కె.అభిజిత్‌రావు, డాక్టర్ పి.నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ చంద్రశేఖర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమృతత్వం వైపు నడిపించేదే ఆధ్యాత్మికత

డాక్టర్ భాస్కరయోగి


మాట్లాడుతున్న డాక్టర్ పి.భాస్కరయోగి

పరిగి,సెప్టెంబరు 15: దుఃఖమయ జీవితం నుంచి విముక్తి కల్పించి అమృతత్వం వైపు నడిపించేదే ఆధ్యాత్మికత అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి అన్నారు. మండలంలోని కాళ్ళాపూర్ పరిధిలోని లొంకక్షేత్రంలో ఆదివారం జరిగిన శ్రావణ మాస మండల దీక్ష ముగింపు కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. భారతీయ పరంపరలో ఆధ్యాత్మికత జీవనానికి ఉన్న ప్రత్యేకత భగవంతుణ్ణి, ప్రకృతిని జీవున్ని సరైన మార్గంలో నడిపించేందుకు పనికి వస్తుందన్నారు. డబ్బులు, వినోదం, ఇతర కార్యక్రమాల్లో మునిగిపోయిన మనుషులు అసలైన సత్యాన్ని విస్మరించి జీవితమంతా దుఃఖంతో బాధపడుతున్నారని తెలిపారు. నిత్య జీవితంలో ఆధ్యాత్మికతను అవలంబిస్తే మనుషులు పుడుతున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. డబ్బు సంపాదించడంతో పాటు, పిల్లలకు సంస్కారాలు ఇవ్వకుండా జీవనం కోల్పోతే మన జీవితాలకు అర్థం, పర్థం ఉండదన్నారు. అందుకు ప్రతీఒక్కరు నిత్యం ఆధ్యాత్మికతకు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగయ్య, నిర్వాహకులు రమేశ్, మాజీ ఉపసర్పంచ్ పి.జంగయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి, సెప్టెంబరు 15: ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య, బస్సు చంద్రయ్యలు అన్నారు. పరిగిలో సీపీఎం పరిగి శాఖ మూడవ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడేళ్ళకోసారి మండల శాఖ సభలు నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందన్నారు. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రైతులకు ఎకరాకు రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, కూలీల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, రాజేందర్, మాంజిల్, యాదగిరి, లాలప్ప, అనిల్, రాంచంద్రయ్య, ప్రశాంత్, వెంకటయ్య పాల్గొన్నారు.

కళ్లెదుటే అక్రమాలు..

కదలని బల్దియా

అక్రమ లేఅవుట్‌లపై అధికారుల మౌనం



- మున్సిపాలిటీ ఆదాయానికి రూ.లక్షల్లో నష్టం
- ఫిర్యాదు అందినా పట్టించుకోని వైనం

తాండూరు, సెప్టెంబరు 15: తాండూరు మున్సిపాలిటీలో అక్రమాలపై బల్దియా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. అక్రమ లే అవుట్‌లపై మౌనం వహిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. తాండూరు పట్టణం విలియమూన్ చౌరస్తా నుంచి ఇందిరా చౌక్‌కు వెళ్లే మార్గంలో లారీ పార్కింగ్ ఎదుట సర్వే నంబర్ 129, 130లలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ డెవలప్‌మెంట్, బెటర్ మెంట్ చార్జీలు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉండగా అవేమీ చెల్లించకుండా వెంచర్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ కార్యాలయానికి 500గజాల దూరంలోనే ఈ వెంచర్ ఉండటం గమనార్హం. గతంలో ఈ స్థలంలో ఇళ్లు ఉండేవి. ప్రస్తుతం ఆ ఇళ్లను కూల్చివేసి ఖాళీ స్థలంగా మార్చారు. సర్వేనంబర్ 130లో ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ స్థలం 36గుంటలు ఉందని, ఈ స్థలాన్ని ఆక్రమించుకొని వెంచర్ చేశారని ఆరోపిస్తూ మాజీ కౌన్సిలర్ సూరజ్‌సింగ్ ఠాకూర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంచర్ చేసేందుకు మున్సిపాలిటీ నుంచి డీటీసీపీకి ప్రతిపాదనలు పంపి అనుమతి పొందాలి. ఆ తర్వాతే లేఅవుట్‌ను చేయాల్సి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం నిర్ధారించిన డెవలప్‌మెంట్ చార్జీలు, నాన్ అగ్రికల్చర్ ధ్రువపత్రం, చార్జీలు, అనుమతుల ఫీజులు మున్సిపాలిటీకి చెల్లించాలి. అధికారుల పరిశీలన, చెల్లింపులు పూర్తియ్యాక లేఅవుట్‌ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఇవేమీ లేకుండా లేఅవుట్ ఉన్నట్లు తేలినా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. గల్లీ నుంచి చిన్న ఫిర్యాదు వస్తే స్పందించే మున్సిపాలిటీ అధికారులు మున్సిపాలిటీ ఆదాయానికి భారీనష్టం వాటిల్లుతున్నా ఈ వెంచర్‌పై ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు వివాదాస్పదమైన ఈభూమిలో అమేర్ అబ్దుల్లా, ఖాలీద్ షఫిఉల్లా, షోయబ్‌లకు సంబంధించిన భూమిగా పేర్కొంటూ అక్రమ వెంచర్‌లో ఫ్లెక్సీలు వెలిశాయి.



లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి



అనుమతులు లేకుండా లేవుట్ చేశారు. అక్రమ లేఅవుట్ నంబర్లు వేసి అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. సర్వేనంబర్ 130పై యజమాన్య హక్కులు ఎలా వచ్చాయో చెప్పడం లేదు. అక్రమ హక్కు ప్రతిపాదించి రూ.కోట్ల విలువైన భూమని కాజేయడమేన్నారు. విచారణ చేపట్టి రూ. కోట్ల విలువైన భూమిని కాపాడాలని ఉన్నతాధికారులను కోరాం. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకంజ వేస్తున్నారో అర్థం కావడంలేదు. అడ్డగోలుగా రోడ్లు, హద్దు రాళ్లు, కడీలను అక్రమంగా ఏర్పాటు చేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోడం లేదు.

- మాజీ కౌన్సిలర్ సూరజ్ సింగ్ ఠాకూర్

రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉంది



తాండూరు పట్టణం సర్వేనంబర్ 130లో 36 గుంటల భూమి 1965 నుంచి రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉంది. అయితే ఇది తమ భూమి అంటూ కొంత మంది డాక్యుమెంట్లు సమర్పించారు. అవి వాస్తవమో? కాదో? అనే విషయంపై విచారణ జరుపుతున్నాం. ఇప్పటికే సర్వేచేసి హద్దులు గుర్తించాం.

- తాండూరు తహసీల్దార్ తారాసింగ్

హై టెన్షన్!

(3వ పేజీ తరువాయి..)


చేవెళ్ల మండలం రేగడిఘునాపూర్‌లో ఏర్పాటు చేస్తున్న 765కేవీ ట్రాన్స్‌మిషన్ టవర్

బీదర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ బహిరంగ ప్రకటనా జారీ చేసింది. లైన్ల నిర్మాణ కాంట్రాక్ట్ ఎల్ అండ్‌టీ దక్కించుకుంది. సదరు సంస్థ భూముల ప్రస్తుత ధరలు, రైతుల అభిప్రాయాన్ని లెక్కలోకే తీసుకోకుండా ఏకపక్షంగా పరిహారాన్ని నిర్ధారించి టవర్లు ఏర్పాటు చేస్తోంది. ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు ఎక్కువ. స్థానిక మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకోకుండా అన్ని జిల్లాలకూ ఒకే రీతిన చెల్లింపులు చేస్తుండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు విద్యుత్ టవర్లు, కారిడార్ కింద ఇకపై ఎలాంటి వాణిజ్య భవనాలు, గోదాములకు అనుమతించరు. వరి, పత్తి వంటి చిన్న మొక్కల పంటలు మినహా ఎత్తుగా పెరిగే పండ్ల తోటలు, టేకు, ఎర్రచందనం వంటి వాటి సాగును అనుమతించరు. ఆశించిన పరిహారం రాక, భవిష్యత్తులో మార్కెట్ ధరకు అనుగుణంగా ఆయా భూములను అమ్ముకోలేక రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తోంది.

వికారాబాద్ జిల్లా..

పూడూరు మండలం తిరుమలాపూర్, కండ్లపల్లి, మన్నెగూడ, పోతిరెడ్డిగూడ, కుత్బుల్లాపూర్, మేడికొండ, రేగడి మామిడిపల్లి, పుడుగుర్తి, మిట్ట కంకల్, రేగడి దోస్వాడ, ఏట్ల ఎర్రవల్లి. మర్పల్లి మంలం ఘనాపూర్, మెగిలిగుండ్ల, కొంశెట్‌పల్లి, తుమ్మలపల్లి, బైకల్, పిల్లిగుండ. మోమిన్‌పేట మండలం కొల్కుంద, అమ్రాది ఖుర్దు, బూర్గుపల్లి, కాస్లాబాద్, మోమిన్‌పేట్, టేకులపల్లి, ఎన్కతల. నవాబుపేట మండలం అర్కతల, మీనపల్లి కలాన్, తిమ్మారెడ్డిపల్లి, యావాపూర్, వట్టి మీనపల్లి, నవాబుపేట, ఎల్లకొండ, గిల్లగూడ, వట్టిమీనపల్లి, చిట్టిగిద్ద, కేశవపల్లి, ఎక్మామిడి, మాదిరెడ్డిపల్లి, లింగంపల్లి, పులిమామిడి, అత్తాపూర్, చిన్నలోపేట్, అక్నాపూర్, పూలపల్లి, నారాయణగూడెం, ద్యాపూర్, సిద్దులూరు, మింగాల్, సిద్దులూర్ పైగ, పూడూరు మండలం కండ్లపల్లి, బాకాపూర్, పోతిరెడ్డిగూడ, తిమ్మాపూర్, కుత్బుల్లాపూర్, చన్గోముల్, మామిడిపల్లి కలాన్, రేగడి మామిడిపల్లి, పుడుగుర్తి, కన్కల్, చింతలపల్లి.

మార్కెట్ రేటు ప్రకారం పరిహారమివ్వాలి



మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తేనే మా భూమి నుంచి టవర్లకు అనుమతిస్తాం. పదేళ్ల క్రితం నాటి పరిహారం ఇవ్వాలని చూడడం దారుణం. సమ్మతి లేకుండా మా భూముల్లో విద్యుత్ టవర్లు పాతడం అన్యాయం. ఇష్టానుసారం వ్యవహరిస్తే ఊరుకోం. 2014లో 400కేవీ లైన్‌కు భూమి కోల్పోయిన రైతులకు 350గజాలకు 4.5లక్షల పరిహారమిచ్చారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు నాలుగింతల ధర పెరిగింది. రూ.కోట్ల విలుగలిగిన భూములు పోతే మేం ఎలా బతకాలి? ఉన్న ఎకరం పోతే మా భవిష్యత్తు ఏమిటి? దీనిపై ప్రభుత్వం ఆలోచించాలి.

- గొంగుపల్లి కృష్ణ, రైతు, రేగడి ఘనాపూర్, చేవెళ్ల మండలం

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం



పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం. పరిహారం చెల్లించిన తర్వాతే 765కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ వేయాలి. 765కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు రైతులు తమ భూములు కోల్పోతున్నారు. రైతులతో చర్చించే పరిహారాన్ని నిర్ధారించాలి. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల్లోని 20 మండలాల్లో 315 గ్రామాల మీదుగా 190 కిలోమీటర్ల లైన్ వేస్తున్నారు. రైతులు 3,200 ఎకరాల భూమి కోల్పోవాల్సి వస్తుంది. 2013-14లో 400కేవీ లైన్‌కు ఇచ్చిన పరిహారాన్నే ఇవ్వాలని లేదంటే పొలాల్లో చేపట్టిన పనులను ఆపకుంటే ఉద్యమం తప్పదు. 2003 ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2017 సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒక్కో టవర్‌కు రూ.15లక్షల నుంచి 20లక్షలు ఇవ్వాలి.

- చింపుల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, పంచాయతీ రాజ్ చాంబర్


మొక్కజొన్న పొలంలో కంకుల నుండి గింజలను తినేసిన దృశ్యం

మొక్కజొన్న పంటకు పక్షుల బెడద

పంటలపై వాలి నిలువునా తినేస్తున్న పక్షులు

ఆందోళన చెందుతున్న రైతులు

పెద్దేముల్, సెప్టెంబరు 15: మొక్కజొన్న పంటకు పక్షుల బెడద ఎక్కువైంది. పంటపొలంలో నిలువునా మక్కబుట్టల నుంచి గింజలను తినేస్తున్నాయి. పక్షుల నుంచి పంటను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారింది. పెద్దేముల్‌లో సుమారు 260 ఎకరాల వరకు రైతులు మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారు. పంట సాగుచేస్తున్న సమయం నుంచే అడవిపందుల బెడద ఉంటుంది. పందుల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు రైతులు పంటలకు పాతచీరలు అడ్డు కట్టి పంటను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తుంటే మరి కొందరు సోలార్ సిస్టం ఏర్పాటు చేసి పందుల నుంచి పంటలను కాపాడుకుంటున్నారు. అడవి పందుల నుంచి పంటను కాపాడుకోవడంలో కొంతవరకు రైతులు సఫలమైనా ఇప్పుడు మొక్కజొన్న గింజలు వేసిన దశ నుంచి పక్షల బెడద ప్రారంభమైంది. అవి మొక్కజొన్న పంటమీద వాలి కంకుల నుంచి గింజలను తినేస్తున్నాయి. ఒకవైపు నుంచి కొడితే మరోవైపు వెళ్లి పంటను తినేస్తున్నాయి. దీంతో రైతులు మొక్కజొన్న పంటను పక్షుల నుంచి కాపాడుకోలేకపోతున్నారు. నష్టాలకు గురవతున్నామని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

మొక్కజొన్న పంటను పక్షులు పాడుచేస్తున్నాయి

మొక్కజొన్న పంటను పావురాలు, ఇతర పక్షులు పాడుచేస్తున్నాయి. పంట నిలువుగా ఉండగానే కంకుల నుంచి గింజలను తినేస్తున్నాయి. మొక్కజొన్న విత్తు కున్న నాటినుండి అడవి పందుల బెడద ఉండేది. సోలార్‌సిస్టం ఏర్పాటు చేయడం వల్ల అడవిపందుల బెడద తప్పింది. మొక్కజొన్న గింజలు వేసే దశనుంచి పక్షుల బెడద మొదలైంది. గుంపులుగా వచ్చి పంటపై వాలుతున్నాయి. మొక్కజొన్న కంకుల నుంచి గింజలను తినేస్తున్నాయి. పంటను చాలా నష్టం చేస్తున్నాయి.

- బల్ల పెంటప్ప (రైతు)

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొడంగల్ రూరల్, సెప్టెంబరు. 15: దుద్యాల్ మండల పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985- 1986 బ్యాచ్ విద్యార్థులు 36 మంది 38 సంత్సరాల తరువాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ద్వారా కలుసుకున్నారు. తమ బ్యాచ్ స్నేహితులలో 12 మంది ప్రభుత్వ ఉద్యోగాలలో కొనసాగుతుండడం గర్వంగా ఉందని అన్నారు. తమ బ్యాచ్‌లో 36 మందికి 36 మంది విద్యార్థులు పాస్ కావడం జరిగిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు రఘుపతి రెడ్డి, రాంరెడ్డి, బాబుసింగ్, జగదీశ్ కుమార్ గౌడ్ హజరై పూర్వ విద్యార్థులను సన్మానించారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు కుర్చీలు విరాళంగా అందజేశారు. ఈ సమ్మేళనంలో ఉస్మాన్, కృష్ణ, బాలకృష్ణ రెడ్డి, శేఖర్, సులేమాన్, వీరేశం, గిరిజ, సునిత, రజిని, విజయలక్ష్మి, సుజాత తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మార్కెట్ కమిటీ

చైర్‌పర్సన్‌గా యాట గీత ఖరారు

- వైస్ చైర్మన్‌గా గూడూరు భాస్కర్‌రెడ్డి, సూదిని శ్రీనివాస్‌రెడ్డి పేర్ల పరిశీలన
- వారం రోజుల్లో కమిటీ ఏర్పాటు
- కసరత్తు ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి
- అందరికీ ఆమోదయోగ్యంగా నిర్ణయం
- విధేయత, కష్టపడిన వారికి స్థానం




యాట గీత నర్సింహ


గూడూరు భాస్కర్‌రెడ్డి


సూదిని శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 15 : ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వారం, పది రోజుల్లో కమిటీ ఏర్పాటుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. కాగా, చైర్మన్, వైస్ చైర్మన్ కమిటీ సభ్యుల పేర్లను అందరికీ ఆమోదయోగ్యంగా.. పార్టీ కోసం కష్టపడిన వారి పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలతో కూడిన ఆమనగల్లు మార్కెట్ కమిటికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన పాలకవర్గం పదవీ కాలం గడువు అక్టోబరు 11 2023తో ముగిసింది. దాంతో కాంగ్రెస్‌కు చెందిన చాలామంది మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులపై ఆశలుపెంచుకొని ఎవరికి వారు ప్రయత్నాలు సాగిస్తూ వస్తున్నారు. అయితే, రిజర్వేషన్‌లో భాగంగా బీసీ మహిళకు కేటాయించిన ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఈసారి పెద్దగా పోటీ కూడా ఏర్పడలేదు. బీసీ కులగణన, ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేసిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ద్వారా కొంతమంది పార్టీ నేతలకు అవకాశం లభిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల వరకు పార్టీ మరింత బలోపేతానికి అవకాశం ఉంటుందని కాంగ్రెస్ అధిష్టానం, ఎమ్మెల్యే కసిరెడ్డి భావిస్తున్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల విషయంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. దాంతో కడ్తాల్ మండలం మైసిగండి గ్రామానికి చెందిన టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ సతీమణి పద్మశ్రీ పేరును ప్రతిపాదించగా.. అందుకు కార్పొరేషన్ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న శ్రీనివాస్‌గౌడ్ అయిష్టత చూపినట్లు సమాచారం. ఆ తరువాత మాడ్గుల మండలం సుద్దపల్లి మాజీ సర్పంచ్ యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ సతీమణి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఆయనకు ఇతర అవకాశాలు కల్పించడానికి నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తూ వంశీకి నమ్మిన బంటుగా పేరుగాంచిన ఆ మనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సతీమణి గీత పేరును చైర్మన్ పదవికి ఖరారు చేసినట్లు సమాచారం. వైస్ చైర్మన్ పదవికి కడ్తాల మండల కేంద్రానికి చెందిన ఎమ్మెల్యే కసిరెడ్డి అనుచరుడు కాంగ్రెస్ జిల్లా నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డితో పాటు మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు సూదిని శ్రీనివాస్‌రెడ్డి పేర్లు పరిశీలిస్తున్నారు. ఏళ్ల కాలంగా తనవెంట నడుస్తున్న గూడూరు భాస్కర్‌రెడ్డి వైపే ఎమ్మెల్యే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. మాడ్గులకు చెందిన సీనియర్ నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి పేరు కూడా వైస్ చైర్మన్ పదవికి చర్చకు వచ్చినా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన్ను బరిలో నిలపాలని అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. డైరెక్టర్ పదవులకు మండలానికి రెండేసి పేర్లను తీసుకున్నట్లు సమాచారం. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు పేర్లు దాదాపు ఖరారు కావడంతో పాలకవర్గం నియామకానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వానికి తుది జాబితా అందజేయనున్నారు.


మట్లాడుతున్న ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

ఘట్‌కేసర్, సెప్టెంబరు 15: ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం ఉపాధ్యాయులకు సూచించారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కాలనీలో ఆదివారం ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నారపల్లి, చౌదరిగూడ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సింది ఉపాధ్యాయులేనని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల పాత్ర పాఠశాలకే పరిమితం కాకూడదన్నారు. సమాజంలో మార్పునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వ్యక్తి నిత్యజీవితంలో మార్పు తీసుకురావడానికి, ప్రభావితం చేయడానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. ప్రైవేటీకరణ నేపథ్యంలో విస్తృత ప్రచారంతో పాటు ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేస్తూ ముందుకెళ్తున్న ఈ తరుణంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరముందన్నారు. దేశంలో స్వాతంత్ర్య పోరాటంతోపాటు నిజాం వ్యతిరేక పోరాటం, తెలంగాణ ఉద్యమంలో వచ్చిన మార్పుతోపాటు తెలంగాణ నిర్మాణంలో ఉపాధ్యాయల పాత్ర ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయలు లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. నారపల్లి, చౌదరిగూడ టీచర్స్ అసోసియేషన్ అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. మిగతావారు సైతం వీరిని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ రాజశేఖర్, నాయకులు శేఖర్, బాలేష్, మన్యం, నారపల్లి-చౌదరిగూడ అసోసియేషన్ ప్రతినిధులు తొంట సత్యనారాయణ, రాళ్లబండి కిరణ్, తొంట కృష్ణ, నాగమల్లు, లక్ష్మి, రవి, శివనారాయణ, రాములు, భాగ్యలక్ష్మి, తిర్మల్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, యాదయ్య, మధుకర్ నర్సిరెడ్డి, శ్రీకాంత్, సత్యం పాల్గొన్నారు.


కీసర రూరల్: గణేశ్ నిమజ్జన ప్రక్రియను పరిశీలిస్తున్న కీసర సీఐ వెంకటయ్య


పరిగి: వినాయక మండపంలో పూజల్లో పాల్గొన్న హెచ్ఎం ఉస్మాన్


నవాబుపేట్: వినాయకుడి పూజలో పాల్గొన్న మాజీ సర్పంచ్ అనితారంగారెడ్డి తదితరులు


తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న ఆర్‌బీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్

గంగమ్మ చెంతకు గణపయ్య


మోమిన్‌పేట్: నిమజ్జనం ఉత్సవాల్లో కోలాటం ఆడుతున్న మహిళలు

కీసర రూరల్, సెప్టెంబరు 15: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గణపతి నవరాత్రులు ఆదివారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మండపాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో, భజనలు, నృత్యాలతో వినాయక విగ్రహాలను గంగమ్మ చెంతకు తరలించారు. నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి పెద్దచెరువు వద్దకు పెద్ద ఎత్తున్న గణపతి విగ్రహాలను తరలించి, నిమజ్జనం చేశారు. నిమజ్జనం పురస్కరించుకుని మున్సిపల్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో చెరువువద్ద ముమ్మర ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, కీసర సీఐ వెంకటయ్య నిమజ్జన ప్రక్రియను పరిశీలించారు. రాంపల్లి పెద్ద చెరువు వద్దకు దాదాపు వెయ్యి విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

పరిగి: పట్టణంలోని సిద్దాంతికాలనీలో గణేశుడి దగ్గర ముస్లిం సోదరుడు, హెచ్ఎం ఎండీ ఉస్మాన్‌అలీ పిల్లలకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. అనంతరం వారికి బహుమతులను అందజేశాడు. అదేవిధంగా గణేశుడికి పూజలుచేసి మత సామరస్యాన్ని చాటాడు. గణేశ్‌మండపాల దగ్గర చిన్నారులు ఆట, పాటలతో హోరెత్తించారు. లక్నాపూర్ ప్రాజెక్టులో సాయంత్రం నిమజ్జనం చేశారు.

దోమ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల్లో భక్తులు తొమ్మిది రోజులపాటు నిత్యపూజలు చేశారు. గ్రామ సమీపంలోని చెరువుల్లో ఆదివారం నిమజ్జనం చేశారు. అయినాపూర్ తదితర పుణ్యక్షేత్రాల నదుల్లో వినాయకులను నిమజ్జనం చేసేందుకు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బయలుదేరి వెళ్లారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం నిర్వహించారు. టేకులపల్లిలో హనుమాన్ మందిరం దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుడిని గ్రామంలోని పురవీధుల మీదుగా నిమజ్జనానికి తరలించారు. యువకుల నృత్యాలు, మహిళల కోలాటాల మధ్య వినాయక నిమజ్జన ఉత్సవం వైభవంగా జరిగింది.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని చిట్లపల్లి గేరి, బీసీ కాలనీల్లో వినాయక మండపాల దగ్గర ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నవాబుపేట: మండలంలోని మైతాప్‌ఖాన్‌గూడ, అత్తాపూర్, ఏక్‌మామిడి తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా మైతాప్‌ఖాన్‌గూడలో మాజీ సర్పంచ్ అనితారంగారెడ్డి వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో మాట్లాడుతూ పండగలు ఏవైనా సోదరభావంతో కలిసిమెలిసి జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి రంగారెడ్డి, బీర్బల్ ఖాజపాష, యాదగిరి, నర్సింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పరిగి: పరిగిలో 17న మంగళవారం నిర్వహించనున్న గణేశ్ విమజ్జన శోభయాత్రలను ప్రశాంతంగా నిర్వహించేందుకు భద్రత ఏర్పాట్లు పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. పరిగి పీఎస్‌లో సిబ్బందికి ఆదివారం వినాయక నిమజ్జనానికి సంబంధించి పలు సూచనలు చేశారు. శోభయాత్రలో డీజేలకు అనుమతి లేదని, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనకూడదని సూచించారు. పోలీసుల సూచనలను ఉల్లంఘిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ధారూరు: ధారూరు గ్రామ వినాయక ఉత్సవ కమిటీ నాయకులు ఆదివారం ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ధారూరులో ఐదు రోజుల పాటు గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా ముగియటానికి సహకరించిన ఎస్ఐకి, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు అశోక్‌ముదిరాజ్, రవీందర్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, మహేష్, వెంకట్, బాలకృష్ణ గౌడ్, రాఘవేందర్, సుధాకర్, రాము పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

కులకచర్ల: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో వినాయకుడికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సూర్యకాంత్, ఓబీసీ మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రలింగం, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్‌లోని కార్గిల్, లాహోటీ, అంబేడ్కర్ చౌరస్తా, బాలాజీనగర్, ఆర్యానగర్, వడ్డర్‌గల్లీ, ఇంద్రానగర్, శాంతినగర్, వినాయక చౌరస్తా, కలాల్‌వాడీ, తెలంగ్‌వాడీ తదితర వార్డుల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు భక్తులు ఆదివారంప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం లాహోటీ కాలనీలో వినాయకుడికి మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, సీఐ శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానంలో పాల్గొన్నారు. నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ధారూరు: మండలంలోని ఎబ్బనూర్‌లోని హనుమాన్ ఆలయం ఆవరణలో ఆదివారం అన్నదానం చేశారు. వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం భజనమండలి సభ్యుల ఆటపాటలతో వినాయకున్ని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: కరన్‌కోట్‌లోని బస్టాండ్, కుర్వ, వడ్డెర బస్తీ, ఎస్సీ కాలనీల్లో ఆర్‌బీఎల్ సీఈవో, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్. రవీందర్‌గౌడ్‌లు పాల్గొని వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక మంటపాల వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరన్ కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శరణబసప్ప, మాజీ ఎంపీటీసీలు రాజ్‌కుమార్, వడ్డె శ్రీనివాస్, జెర్రె నాగప్ప, శ్రీనివాస్‌గౌడ్, బసప్ప, సుధాకర్, అనిల్, భరత్ కిషోర్ పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, ఎస్ఐ విఠల్‌రెడ్డిలను గ్రామస్తులు తదితరులు సన్మానించారు.

పెద్దేముల్: భగవంతున్ని భక్తితో పూజించాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్ అన్నారు. మండలంలోని మంబాపూర్ గ్రామంలోని సాగర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం ఆయన కోట్‌పల్లి మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ సాయిని నారాయణ రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాలటి శ్రీనివాస్, శ్రీనివాస్, ఎల్లప్ప, గొబ్బురు దస్తప్ప పాల్గొన్నారు.


ధారూరు: ఎబ్బనూర్‌లో అన్నదాన కార్యక్రమం


పెద్దేముల్: మంబాపూర్‌లో సాగర్స్ కాలనీలోని వినాయకుడిని దర్శించుకున్న నాయకులు

వినాయకులను దర్శించుకున్న స్పీకర్

వికారాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్‌లోని వినాయక మండపాలను తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సందర్శించి వినాయకులను దర్శించుకున్నారు. ముందుగా వికారాబాద్ పట్టణంలోని సాకేత్‌నగర్‌లో మధ్యాహ్నం పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పట్టణంలోని ఇందిరానగర్, శివ రాంనగర్, న్యూగంజ్, ఓల్డ్‌గంజ్, గాంధీ కాలనీతోపాటు పట్టణంలోని ఆయా కాలనీలో వెలసిన మండపాల వద్దకు వెళ్లి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల నిర్వాహకులు స్పీకర్‌కు స్వాగతం పలికి పూజల అనంతరం ఘనంగా సన్మానించారు. వార్డులల్లో ప్రజలు స్పీకర్‌తో ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. ఆయన వెంట మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కిషన్ నాయక్ తదితరులు ఉన్నారు. 17న వికారాబాద్ పట్టణంలో నిర్వహించే వినాయక నిమజ్జన కార్యక్రమానికి హాజరు కావాలని ఉత్సవ కమిటీసభ్యులు స్పీకర్‌ను కోరారు. ఆదివారం సాకేత్‌నగర్‌లో పూజ కార్యక్రమానికి హాజరైన స్పీకర్‌ను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాదవరెడ్డి, కార్యదర్శి చిగుళ్లపల్లి రమేష్, కన్వీనర్ కృష్ణ పంతులు కలిసి ఆహ్వానించారు. అదే విధంగా ఉత్సవం ఏర్పాట్లకు సంబంధించి , పలు అనుమతులకు సంబంధించి స్పీకర్ దృష్టికి ఉత్సవ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు.


నిమజ్జనంలో పాల్గొనాలని స్పీకర్‌ను కోరుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వేలంలో గణేశ్ లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో హనుమాన్ మందిరం వినాయకుడి నిమజ్జనంలో గ్రామానికి చెందిన ఎంఏ.అజీజ్ తనయుడు సల్మాన్ ఆదివారం రాత్రి నిర్వహించిన లడ్డూవేలంలో రూ.23వేలకు దక్కించుకున్నాడు. మండల చరిత్రలో ముస్లిం వ్యక్తి వినాయక లడ్డూ వేలంలో పాల్గొనడం ఇదే తొలిసారి. ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్న సల్మాన్‌ను స్థానికులు అభినందించారు.


వేలంలో గణేశ్ లడ్డూను దక్కించుకున్న ముస్లిం యువకుడు సల్మాన్

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

కీసర రూరల్, సెప్టెంబరు 15: ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం గొల్లగుడెం గ్రామానికి చెందిన కావ్య(18) కీసరలోని ఎస్ఎస్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. ఆమె ఉన్నట్టుండి శనివారం అస్వస్థతకు గురైంది. ఈ విషయాన్ని ఆస్పత్రి నిర్వాహకులు కావ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కావ్య తండ్రి దేశ్‌పాండే రవి కీసరకు చేరుకుని ఆమెను భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అమ్మాయి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది, గాంధీకి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో ఆమెను అక్కడి నుండి గాంధీ తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా గుర్తుతెలియని ఆకతాయిలు మూడురోజులుగా ఫోన్ ద్వారా అమ్మాయిని వేధించటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు, ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు


ఘటనాస్థలంలో కారు, ఆటో

పరిగి, సెప్టెంబరు 15: ఎదురెదురుగా వస్తున్న కారు-ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం పరిగి శివారులోని సబ్‌స్టేషన్ దగ్గర జరిగింది. దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన వెంకట్ తనకారులో కుటుంబసభ్యులతో హైదరాబాద్‌కు వెళుతున్నాడు. రంగాపూర్ నుంచి పరిగి వైపు వస్తున్న ఆటో ఢీకొంది. కారులో ఉన్నవారికి ఎలాంటి హానీ కలగలేదు. ఆటోలో ఉన్న ఇద్దరికి మాత్రం స్వల్ప గాయాలయ్యాయి.

రేషన్ బియ్యాన్ని నూకలు చేసి విక్రయం.. వ్యక్తిపై కేసు

ధారూరు, సెప్టెంబరు 15: రేషన్ బియ్యాన్ని నూకలు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని మోమిన్‌కలాన్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన కట్ట మాణిక్యప్రభు గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని మిషన్(మర)లో వేసి నూకలుగా మారుస్తాడు. ఈ నూకలను కోళ్ల ఫారాలకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు గ్రామానికి వెళ్లి మాణిక్ ప్రభు ఇంట్లో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 27.5 క్వింటాళ్ల నూకలు, 2.5క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. మిషన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మాణిక్ ప్రభుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూమి విషయంలో మోసం.. వ్యక్తి రిమాండ్


నిందితుడు శ్రీనివాస్‌రావు అలియాస్ రాజేశ్

నవాబుపేట, సెప్టెంబరు 15: భూమి విషయంలో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన నవాబుపేట మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మాదిరెడ్డిపల్లి గ్రామ శివారులో అంకరావు, శ్రీనివాస్‌రావు అలియాస్ రాజేశ్, వంగ రాజేందర్‌రెడ్డి, వంగ అంకిత్‌రెడ్డిలు కలిసి సర్వే నెం.59, 60లో 32 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వీరిలో ఒంటిపులి శ్రీనివాస్‌రావు అలియాస్ రాజేశ్, వంగ రాజేందర్‌రెడ్డి, అంకిత్‌రెడ్డిలు ఆ భూమిని విక్రయించారు. భూమిని తనతో పాటు కొనుగోలు చేసి తన ప్రమేయం లేకుండా భూమిని విక్రయించి తనకు మోసం చేశారని అంకరావు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనలో ఒంటిపులి శ్రీనివాస్‌రావు అలియాస్ రాజేశ్‌ను ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అత్వెల్లిలో ఉచిత వైద్య శిబిరం


అత్వెల్లిలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 15: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లిలో ఆదివారం అల్ హాష్మీ పాలి క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ మానస శ్రవణ్ గుప్త ప్రారంభించారు. స్థానికులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎండీ బషీర్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట్ ప్రేమ్‌దాస్, కాంగ్రెస్ నాయకులు శ్రవణ్‌గుప్త పాల్గొన్నారు.

రేపు విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవం

తాండూరు, సెప్టెంబరు 15: విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని భారీగా చేపట్టాలని నిర్ణయించారు. తాండూరు నియోజవర్గ విశ్వ బ్రహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో రేపు(మంగళవారం) హైదరాబాద్ రోడ్డు మార్గం ఖాంజాపూర్ గేట్(గుట్ట) వద్ద నిర్వహించనున్నారు. విశ్వకర్మ భగవానుని పూజా, యజ్ఞం కార్యక్రమాలతో పాటు పంచామృత స్నానం, పుణ్యవచనం, విశ్వకర్మ పతకం ధ్వజారోణ, నవగ్రహ, గణపతి పూజ, హోమం, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవానికి ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలను సంఘం ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు. బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు ఈ మహోత్సవానికి హాజరుకానున్నారు. హోమ కార్యక్రమంలో పాల్గొనే దంపతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్యం


లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 15: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు చిలుగూరి మంకయ్య తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మర్రిపల్లిగూడలో చిలుగూరి జంగయ్యకు రూ.60వేలు, నక్కలపల్లి ఐలయ్య కుటుంబసభ్యులకు రూ.25 వేలు, బోదాసు మల్లేష్ కుటుంబసభ్యులకు రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుగూరి లక్ష్మణ్, మేకల సాయికుమార్, పల్లపు శ్రీకాంత్ జంగయ్య, శ్రీశైలం, జంగయ్య, వెంకటేష్‌గౌడ్, సత్తయ్య పాల్గొన్నారు.

రేపు ప్రజా పాలన దినోత్సవం

తాండూరు, సెప్టెంబర్ 15: ఈ నెల 17న ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. తాండూరు డివిజన్ పరిధిలోని కొడంగల్, తాండూరు మున్సిపాలిటీలతో పాటు ఏడు మండలాల్లోని 260గ్రామపంచాయతీలు, మండల కేంద్రాలలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలలో ప్రజాపాలన వేడుకల సందర్భంగా జతీయ జెండా ఎగురవేయాలని ఆదేశించారు. దీంతో వేడుకలకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 17వ తేదీన 'తెలంగాణ విమోచన' విలీన దినాలుగా పేర్కొంటారు. నియోజకవర్గ కేంద్రమైన తాండూరులో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వేడుకలను చేపట్టేందుకు నిర్ణయించారు.

దోమ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న ఉదయం 9 గంటలకు ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించనున్నట్లు మహేశ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దోమ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అనధికారులు, మహిళా సంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు.

నవభారత నిర్మాణంలో ఇంజనీర్లది కీలకపాత్ర


పట్టభద్రులైన ఇంజనీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్ నల్ల మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 15: నవభారత నిర్మాణంలో ఇంజనీర్లదే కీలకపాత్ర అని నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పట్టబద్రులైన ఇంజనీర్లకు పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ చైర్‌పర్సన్ కేతిరెడ్డి సంధ్య, డైరెక్టర్ నల్ల దివ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక


మోత్కూర్‌లో ఎన్నికైన దేవాలయ నూతన కమిటీ సభ్యులు

దోమ, సెప్టెంబరు 15: మండలంలోని మోత్కూర్‌లో ఆదివారం ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్‌పర్సన్‌గా రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్‌గా దోమ నర్సింహులు, కార్యదర్శిగా మడుగు మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా గుండుమళ్ల మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా జీడి చెన్నయ్య, క్యాషియర్‌గా సైదుగారి శివకుమార్, సాంస్కృతిక కమిటీ చైర్మన్‌గా గెరిగంటి కృష్ణయ్య తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి, ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో లొల్లి

- శోభాయాత్రలో డీజే వివాదం
- సీఐ శ్రీనివాస్ జోక్యంతో సద్దుమణిగిన గొడవ


విగ్రహాన్ని కిందకు దింపుతున్న గ్రామస్థులు

పూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రంలో గణేశుడి నిమజ్జన శోభాయాత్రలో ఆదివారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. పూడూరు మండల కేంద్రంలో ఎస్సీకాలనీ, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో ఏర్పాటు చేసిన గణేశులకు ఆదివారం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఒక వాహనంలో రెండు విగ్రహాలు, మరో వాహనంలో ఒక విగ్రహన్ని శోభయాత్రగా వెళ్లారు. అయితే మండల కేంద్రంలో ఈ గణేశ్ విగ్రహాలను డీజే సౌండ్స్‌తో శోభయాత్ర కొనసాగుతుండగా పోలీసులు వచ్చి డీజేకు అనుమతి లేదని, నిలిపివేయాలని అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే ఒక గణేశుడి విగ్రహానికి నడిరోడ్డుపై దింపి గ్రామస్థులు నిరసనను వ్యక్తం చేశారు. ఎస్ఐ మధుసూధన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్ఐ మద్యం సేవించి వివాదాన్ని సృష్టించారని గ్రామస్తులు కొందరు ఆరోపించారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులపై అధికార పార్టీ నేతల ప్రమేయంతోనే ఇలా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈవివాదం రాజకీయ రంగు పులుపుకుందని చెబుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల అంతర్గత ఆధిపత్యం కోసమే ఈ వివాదానికి దారి తీసిందని చెబుతున్నారు. అనంతరం పరిగి సీఐ ఎస్ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. డీజే వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అనంతరం రాత్రి గణేశుల విగ్రహాలను నిమజ్జనం చేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

'పీహెచ్‌సీ ఏర్పాటు ఫార్మా రైతులను మోసం చేయడమే'

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 15: ప్రభుత్వం దుద్యాల మండల పరిధిలోని హకీంపేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఆదివారం జీవో జారీ చేయడం ఫార్మా కంపెనీ బాధిత రైతులను మోసం చేయడమేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేశ్‌రాజ్ ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రం దుద్యాలకు కాకుండా హకీంపేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూర్ చేయడం ఫార్మా బాధిత రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. ఫార్మా పేరుతో ఈ ప్రాంత రైతుల భూములను లాక్కోని మనుషుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్యం ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తామనడం శోచనీయమన్నారు. అభివృద్ధి పేరుతో ఫార్మా కంపెనీలు తీసుకువస్తే సహించేది లేదన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత


ఆంజనేయులు కుటుంబసభ్యులకు నగదును అందజేస్తున్న తోటి మిత్రులు

కీసర, సెప్టెంబరు 15: కీసర ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000-01 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన సాదా ఆంజనేయులు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. పూర్వ విద్యార్థులు రూ.57వేలు పోగుచేసి ఆంజనేయులు భార్యకు ఆదివారం అందజేశారు. అదేవిధంగా ఇద్దరు పిల్లల విషయంలో సహాయం చేసేందుకు భరోసానిచ్చారు.

రజక ఉపాధ్యాయ, ఉద్యోగ నూతన కమిటీ

తాండూరు, సెప్టెంబర్ 15: తాండూరు రజక ఉద్యోగ ఉపాధ్యాయ సంఘంను ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సుధాకర్, అధ్యక్షులుగా ఐనెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తిమ్మాయిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రమేష్, సంధ్యరాణి కార్యదర్శులుగా వెంకట్, అనురాధ, కోశాధికారిగా రాములు ఎన్నుకున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి